క్లుప్తంగా

గ్రంథాలయం సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి లక్ష్మి

గుర్ల: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి మంగళవారం సందర్శించారు. గ్రంథాలయంలో పుస్తకాలు, రికార్డులను పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ప్రభుత్వ, దాతల సహకారంతో సమకూర్చుతూ, గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న లైబ్రేరియన్ రామారావును ఆమె అభినందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గజపతినగరం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయంతిప్రసాద్

గజపతినగరం: మండల కేంద్రంతో పాటు ఎం.వెంకటాపురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ కాలువలను ఎంపీడీఓ పి.జయంతిప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పనులను నాణ్యవంతంగా చేపడుతుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రాము నాయుడు, పంచాయతీ కార్యదర్శి మంత్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి తహసీల్దార్‌గా హరి



తహసీల్దార్ హరికి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ ఉద్యోగులు

బొండపల్లి: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పి.హరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని భూసేకరణ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఈయన్ని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీపై పంపించారు. తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకులు సత్యనారాయణ ఆర్ఐ గౌరీశంకర్, వీఆర్‌ఓలు ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన ఆర్.శంకరరావును గుర్ల మండలానికి బదిలీ చేశారు.

సచివాలయాల్లో తనిఖీలు



వెదురువాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండలంలోని కనిమెరక, ఎం.కొత్తవలస, వెదురువాడ గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ ఎస్. హరిహరరావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ జాబ్ చార్టుకు అనుగుణంగా పని చేయాలని, ప్రతీ రికార్డు పక్కాగా ఉండాలని సూచించారు. అలాగే జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడా కూడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గుడివాడ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌నాయుడు

మెంటాడ (గజపతినగరం రూరల్): గజపతినగరం మండల కేంద్రంతో పాటు గుడివాడ, తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రమేష్‌నాయుడు మంగళవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ర్యాంపులు, సైన్ బోర్డులను పరిశీలించారు. ఈసందర్భంగా అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల పరిశీలన అధికారి ప్రమీలాగాంధీ, తహసీల్దార్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చిన్నారులతో ఎన్నికల ర్యాలీలు, నినాదాలు చేయించకూడదన్నారు. అనుమతులు లేకుండా ధర్నాలు, ర్యాలీలు చేపట్టకూడదని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష... పేదలకు రక్ష

- గ్రామాల్లో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
- సుమారు 1,200 మందికి వైద్యపరీక్షలు
- అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ



గుర్ల: గుజ్జింగివలసలో వృద్ధుడికి మందుల కిట్ అందజేస్తున్న నాయకులు సూర్యనారాయణరాజు, సన్యాసినాయుడు

గుర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కె.వి. సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసి నాయుడు, బెల్లాన బంగారునాయుడు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మండలంలోని గుజ్జింగివలసలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదలు వైద్యం చేయించుకునేందుకు ఇది వరకు ఉన్న రూ.5 లక్షల వ్యయపరిమితిని సీఎం జగన్ రూ.25 లక్షల కు పెంచారన్నారు. శిబిరంలో 150 మందికి తెట్టంగి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆక్వాబ్, శ్రీనివాసరావు, సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందుల కిట్లు అందజేశారు. స్థానిక నాయకులు రెడ్డి అప్పలనరసయ్య, రెడ్డి మురళీధర రావు, అట్టాడ రామకృష్ణ, అట్టాడ అప్పలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బానాదిలో...

వేపాడ: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మండలంలోని బానాది గ్రామంలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కర్రి యశోద ప్రారంభించారు. డాక్టర్ ధరణితో పాటు స్త్రీవైద్య నిపుణులు వరలక్ష్మి, ఆర్థోపెడిక్ మోహన్, ఆప్తాలమిక్ ఈశ్వరరావు శిబిరంలో 402 మందికి వైద్య సేవలు అందించారు. మొదటి విడత ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులు ఆరా తీశారు. సీహెచ్‌ఓ ఆంజనేయులు, వేపాడ పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

విజినిగిరిలో..

జామి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మండలంలోని విజినిగిరి గ్రామంలో మంగళవారం జామి పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు.శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కిలారి సూర్యారావు ప్రారంభించారు. వైద్యాధికారులు సామ్రాజ్యలక్ష్మి, ఏ.వి.ఎస్.ఉషారాణి, ఎన్.ఏ. చారి శిబిరంలో 224 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉన్నట్లు గతంలో గుర్తించిన 18 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సచివాలయ కార్యదర్శి సుజాత, సీ హెచ్‌ఓ ఫ్లోరెన్స్ ఎంఎల్ హెచ్‌పీలు, ఆరోగ్య సహాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గజపతినగరం: గజపతినగరం సచివాలయం- 1 వద్ద వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తవుడు



జామి: విజినిగిరిలో వృద్ధులకు కళ్లద్దాలు అందజేస్తున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి, సర్పంచ్ సూర్యారావు

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక సచివాలయం-1 వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ గార తవుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. శిబిరంలో 423 మందికి మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు డి.సుష్మ, కె.పుష్పాంజలి, గైనకాలజిస్ట్ శోభాదేవి, ఆప్తాలమిక్ శ్రీనివాసరావు, సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందుల కిట్లు అందజేశారు. స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ, ఎంపీడీఓ జయంతి ప్రసాద్, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, ఈఓపీఆర్డీ జనార్దనరావు, వీఆర్‌ఓ శ్రీరామ్, సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వేపాడ: బానాదిలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ధరణి



వేపాడ: బానాదిలో మహిళకు కళ్లద్దాలు అందజేస్తున్న ఆప్తాలమిక్ ఈశ్వరరావు

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి



చీపురుపల్లిరూరల్(గరివిడి): యువతకు క్రికెట్ కిట్లుఅందజేస్తున్న ధీర ఫౌండేషన్ అధినేత సందీప్‌బాబు

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడా నైపుణ్యం పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులగా ఎదగాలని ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్‌బాబు అన్నారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చీపురుపల్లి మండలంలోని పలుగ్రామాల యువ తకు మంగళవారం 100కు పైగా క్రికెట్ కిట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు తమ ప్రోత్సా హం ఉంటుందని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం-ఆంధ్రా' పేరిట క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. చీపురుపల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసుల నాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, నాయకులు పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు, అధికారుల శ్రీనుబాబు, చందక గురునాయుడు, ఇప్పిలి గోవింద్, ఇప్పిలి తిరుమల,మంగళగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చీపురుపల్లి: యువతకు క్రీడా పరికరాలు అందజేస్తున్న వంశీకృష్ణ

క్రీడల్లో రాణించేవారికి ప్రోత్సాహం

చీపురుపల్లి: క్రీడల్లో రాణించే యువతకు తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు క్రీడా కారులకు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఓవైపు విద్య, మరో వైపు క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గిరడ రాందాసు, ఇప్పిలి తిరుమల, కరణపు ఆది, రెడ్డి నీలకంఠం, మీసాల శీతారాం, మీసాల రామారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పీఎల్‌పీయూఎస్ చైర్మన్ దుర్గయ్య

గంట్యాడ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజోపయోగ సేవల శాశ్వత లోక్ అదాలత్ (పీఎల్‌పీయూఎస్) చైర్మన్ గరికిన దుర్గయ్య అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లను ఆశ్రయించాలని చెప్పారు. ప్రజోపయోగసేవల్లో ఏమైనా నష్టం జరిగితే ప్రజలు శాశ్వతలోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని చెప్పారు. సెషన్స్ కేసులో ఉన్న ముద్దాయిలకు బెయిల్, కేసుల విచారణ కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను సంప్రదించాలని చెప్పారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ జనన, మరణధ్రువీకరణ పత్రాల కోసం సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని, వివాహాలను రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలను సందర్శించాలి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలను, పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని పోలీసులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసంద ర్భంగా పోలీస్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల సమయాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులను గ్రామాల్లో గుర్తించి పార్టీలకతీతంగా బైండోవర్ చేయాలని చెప్పారు. వారి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో మంచి ప్రవర్తన కోసం బాండులు తీసుకోవాలన్నారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాల సమాచారం తక్షణమే పోలీసులకు అందేలా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ వెంట విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ సురేంద్ర నాయుడు ఉన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ జయంతిప్రసాద్

గజపతినగరం: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారుల పేరిట ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ పి.జయంతి ప్రసాద్ సచివాలయ సిబ్బందికి సూచించారు. గజపతినగరం సచివాలయం-1ను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమావేశమై, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌పై పలు సూచనలు చేశారు. స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ,వైస్ సర్పంచ్ కె.రామునాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ ఎంపీడీఓ వెంట ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌ల పదవీకాలం పొడిగింపు

బొండపల్లి: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల త్రిసభ్య కమిటీ చైర్మన్‌ల పదవీ కాలాన్ని మరో ఆరునెలలు పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.బొండపల్లి, గొట్లాం, రాచకిండాం పీఏసీఎస్‌ల చైర్మన్‌గా బుద్దరాజు వెంకటప్రభుజీరాజు, మహంతి రమణ, గొల్లు సతీష్‌తో పాటు ఇద్దరు చొప్పున సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈఏడాది జూలై 30వ తేదీ వరకు వీరు పదవుల్లో కొనసాగునున్నారు.

తోటపు ఎద్దుకు అంత్యక్రియలు



శివైక్యం చెందిన తోటపుఎద్దుకు పూజలు చేస్తున్న పూజారి

శృంగవరపుకోట: సింహాద్రి అప్పన్న ప్రతిరూపంగా పూజలు అందుకునే ఎస్.కోటకు చెందిన తోటపు ఎద్దు మామిడిపల్లి గ్రామంలో మంగళవారం శివైక్యం చెందింది. మామిడిపల్లి గ్రామస్తులు స్థానిక దాసరి కులస్థులకు సమాచారం అందించారు. దాసరి కులస్థులు పలువురు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి తోటపు ఎద్దుకు పూజలు చేసి పానుపు చేశారు.

రహదారి భద్రతపై అవగాహన



ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, విద్యార్థులు

శృంగవరపుకోట: ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో మంగళ వారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డీఎం కె.రమేష్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్యపనులు



మెరకముడిదాం ఎం.రావివలసలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

మెరకముడిదాం/దత్తిరాజేరు: మెరకముడిదాం మండలంలోని ఎం.రావివలస, దత్తిరాజేరు మండలంలోని గుచ్చిమి గ్రామాల్లో రెండురోజులుగా పారిశుద్ధ్యపనులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని అన్ని వీధి కాలువల్లో పేరుకు పోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మి కులు తొలగించి, గ్రామానికి దూరంగా తరలిస్తున్నారు. పనులను సర్పంచ్‌లు పిన్నింటి శ్రీహర్ష, కడుబండి సూర్యనారాయణ పర్యవేక్షించారు.

నియామకపత్రాల అందజేత



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: మండలంలోని లక్కిడాం, కొత్త వెలగాడ గ్రామాలకు నూతనంగా నియమితులైన ఇద్దరు వలంటీర్లకు ఎంపీపీ పీరుబండి హైమావతి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏటి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ అబ్జర్వేటర్లు

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్నామని జిల్లా లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ అబ్జర్వేటర్లు రాంబాబు, సన్యాసినాయుడు తెలిపారు.స్థానిక బాలుర హైస్కూల్‌ను మంగళవారం వారు సందర్శించారు. 6,7,8వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల మార్కులు, హాజరు, ఇతర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఆర్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కల్లు గీత కార్మికులు

గజపతినగరం: నియోజకవర్గంలో ఉన్న సుమారు 1,500 మంది కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కల్లుగీత కార్మిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల గీత కార్మికులు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్‌వి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వృత్తిలో మరణించిన కల్లుగీత కార్మికుల కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, వికలాంగులైతే రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాటి, ఈత, కొబ్బరి మొక్కల పెంపకానికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. కల్లు గీత సహకార సంఘాలు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ పరిధిలోనే ఉండేలా చూడాలన్నారు. గీత కార్మికులు కె.సూరప్పడు,సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులాహ్వానం

చీపురుపల్లి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడి యట్(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏ.రాణిశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వతరగతి, ఇంటర్మీడియ ట్‌లో 80 చొప్పున సీట్లు ఉన్నాయని, వీటిలో ఎస్సీలకు 60, బీసీ-సి వారికి 10, ఎస్టీలకు 5, బీసీ 4, ఓసీలకు ఒక సీటు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష రాయాలనుకునే విద్యార్థినులు 2023-24 విద్యా సంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతి చదివి ఉండాలని వివరించారు. ఈనెల 23లోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి10న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99493 56322, 93477 45277 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వియ్యంపేట గురుకులంలో..

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఈనెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



చామలాదేవి పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని వావిలపాడు, చామలాదేవి అగ్రహారం ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు చదివించి, రాయించారు. విద్యార్థుల వర్కు బుక్స్, టీచర్ల లెసన్ ప్లాన్, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం నీల కంఠరాజపురం హైస్కూల్ లో నిర్వహిస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ పోగ్రాంను(ఎల్ఈపీ) పరిశీలించి, ఉపాధ్యాయులతో సమావేశ మయ్యారు. పదోతరగతి పబ్లిక్ పరీక్ష ల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.